# 4

# సంపూర్ణులమగుటకు

## (5:11-6:20)

హెబ్రీ పత్రిక ఎవరినుద్దేశించి వ్రాయబడిందో వారు పడపోయే స్థితిలోనున్నారు. వారు ఈ పత్రికను మొదటిసారి చదివే సమయానికి వారి పరిస్థితి ఏమిటి? ఇది వాక్యంలో చెప్ప బడింది:

> ఇందునుగూర్చి మేము చెప్పవలసినవి అనేక సంగతులున్నవి గాని, మీరు వినుటకు మందులైనందున వాటిని విశదపరచుట కష్టము. కాలమునుబట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసినవారై యుండగా, దేవోక్తులలో మొదటి మూలపాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలుత్రాగవలసినవారే గానీ బలమైన ఆహారము తినగలవారుకారు. మరియు పాలుత్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతి వాక్యవిషయములో అనుభవములేనివాడై యున్నాడు. వయస్సు వచ్చినవారు అభ్యాసముచేత మేలు కీడులను వివేచించుటకు సాధకముచేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును (హెబ్రీయులకు 5:11-14).

వారు ఎదుగుదల లేనివారు ఆత్మీయంగా శిశువులు, ఘనాహారం తీసుకోలేనివారు. వారు క్రైస్తవులుగా ఉపదేశకుల స్థితిలో ఉండవలసినవారైయుండి ఇంకనూ “మూలోపదేశములను” నేర్చుకుంటూనే ఉన్నారు.

ఈ రోజున సంఘంలోని అనేకమందిని ఇదేవిధంగా వర్ణించవచ్చు. వారు ఎన్నో సంవత్సరాలనుండి క్రైస్తవులుగా ఉన్నారు గానీ, ఆత్మీయంగా ఎదుగలేకపోయారు. వాక్యంలోని లోతైన “ఘన పదార్థాలను” స్వీకరించలేకయున్నారు. అలాగే సువార్తలోని ప్రాథమిక విషయాలు కూడ వారికి అర్థం కావడం లేదు. ఇంకనూ శిశు ఆహారాన్ని స్వీకరిస్తున్నారు!

హెబ్రీ పత్రిక ఉద్దేశింపబడిన సంఘంలోని వీరివలెనే ఈ నాడు సంఘంలోని అనేకమంది ఎదుగుదల లేకయున్నారు. కాబట్టి వారికి ఏం చెప్పబడిందో దాన్ని మనం గ్రహించి అన్వయించుకుందాము. వారికి పరిశుద్ధాత్ముడు ఇచ్చిన సందేశమును బట్టి మన ఆత్మీయ ఎదుగుదల లోపమును సరిదిద్దుకుందాము.

### ఆత్మీయంగా ఎదుగుదల లేని క్రైస్తవులు ఏం చేయాలి?

“వినుటకు మందులైయున్న” మొదటి శతాబ్దపు ఆత్మీయ శిశు స్థితిగల క్రైస్తవులు ఏం చేశారు? చదవండి హెబ్రీయులకు 6:1, 2:

> కాబట్టి నిర్జీవక్రియలను విడిచి, మారుమనస్సు పొందుటయు, దేవునియందలి విశ్వాసమును బాప్తిస్మములనుగూర్చిన బోధయు, హస్తనిక్షేపణమును, మృతుల పునరుత్థానమును, నిత్యమైనతీర్పును అను పునాది మరల వేయక, క్రీస్తునుగూర్చిన మూలోపదేశము మాని, సంపూర్ణులమగుటకు సాగిపోదము.

వారు "సంపూర్ణులగుటకు సాగిపోవాలి." (KJVలో "సంపూర్ణత" అని తర్జుమా చేయబడిన పదమునకు "పరిపక్వత" అని అర్థం.)

మనము అదే లక్ష్యముతో సాగిపోవాలి. ఆత్మీయ పరిపూర్ణత అనేది ప్రతి క్రైస్తవుని లక్ష్యము కావాలి. మనము క్రైస్తవులమయినప్పుడు, మనం తిరిగి జన్మించాము. క్రీస్తునందు పిల్లలముగా మన క్రైస్తవ జీవితమును ప్రారంభించాము. కానీ మన జీవితమును సంఘంలో కొనసాగిస్తున్నప్పుడు మనం ఎదగాలి, సంపూర్ణులవ్వాలి. ఆత్మీయంగా పరిపూర్ణత సాధించి పెద్దవారమవ్వాలి (చూడు 2 పేతురు 3:18)!

ఈ లక్ష్యాన్ని ఎలా సాధించగలము? సాధారణంగా చెప్పాలంటే, దేవుని వాక్యంలో పెంపారడం ద్వారా మనం ఎదుగుతాము (చూడు 1 పేతురు 2:2). దేవుని వాక్యం అమూల్యమైనదిగా మనం ఎంచాలి. మనకు ఇష్టమైన ఆహారం కొరకు ఎలా ఆకలి కలిగియుంటామో అలాగే దేవుని వాక్యం కొరకు ఆకలి కలిగియుండాలి (కీర్తన 19:10బి; చూడు మత్తయి 5:6). దేవుని వాక్యంచేత పెంపారకుండా ఏ క్రైస్తవుడూ ఆత్మీయంగా ఎదుగలేడు.

ఆత్మీయంగా ఎదుగుటకు వాక్య అధ్యయనమును సువార్త అ, ఆ, ఇ, ఈల వరకే (మూలోపదశమువరకే)[1] పరిమితం చేయకూడదు. పైపైన మాత్రమే గాకుండా లోతుగా మనం అధ్యయనం చేయాలి. ఆత్మావేశిత గ్రంథకర్త పేర్కొన్న విధంగా వాక్యపు "ఘనాహారాన్ని" స్వీకరించడానికి దాన్ని అధ్యయనం చేసి గ్రహించాలి. మనం క్రొత్త నిబంధనలోని "ప్రాథమిక అంశాలను" మాత్రమే గ్రహించి మరింత విషయమును నేర్చుకొనుటకు ఆసక్తి లేనట్లయితే మనం ఆత్మీయంగా ఎదిగిపోయామని చెప్పవీలులేదు. సంఘాలు, వ్యక్తులు ఈ సందేశాన్ని వినాలి. కొన్ని సంఘాల్లో కొంతమంది వినుటకు ఆసక్తి చూపించరు లేదా "దేవోక్తులలో మొదటి మూల పాఠములు" (5:12) తప్ప మరేమీ వినేందుకు ఆసక్తి చూపించరు లేక వినే అవకాశం ఉండదు.

"మూలోపదేశమును" మానుకొనుమని గ్రంథకర్త చెప్తున్నప్పుడు అతడు పూర్తిగా మానెయ్యమని చెప్పడం లేదు. క్రైస్తవ్యంలోని ప్రాథమిక సత్యములు బోధకులు బోధించుట మానెయ్యాలని అతడు చెప్పడం లేదు.[2] ఆ ప్రాథమిక విషయాలు మాత్రమే బోధించబడకూడదని, వాటి మీదనే దృష్టి నంతటిని కేంద్రీకరించనక్కర్లేదని అతడు చెప్తున్నాడు. ఇంతేగాక, ప్రాథమిక విషయాలుగా చెప్పబడుతున్న వాటిని గాక ఇతర వాక్య అంశములను మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు క్రైస్తవులు ప్రయత్నించాలి. కొన్ని సంఘాలు దీన్ని అపార్థం చేసుకుని "ప్రాథమిక అంశములను" పూర్తిగా విస్మరిస్తున్నాయి. అటువంటప్పుడు తమ విశ్వాసంలోని ప్రాథమిక విషయాలను సైతం వారు గ్రహించలేరు!

తరువాతదిగా క్రైస్తవులందరూ ఆత్మీయంగా ఎదగాలని గ్రంథకర్త విశ్వాసులను కోరుకున్నాడు. వారు అలా చేయుటకు ఏది పురికొల్పుతుంది?

### ఎదుగుదల లేని క్రైస్తవులు "సంపూర్ణత ఎందుకు సాధించాలి"?

తన పాఠకులు సంపూర్ణులుగా సాగిపోవుటకు "క్యారట్ లేదా కర్ర" విధానాన్ని[3] గ్రంథకర్త ఉపయోగిస్తున్నాడు. ఎదుగుటకు రెండు కారణాలను 6వ అధ్యాయములో అతడు ఇస్తున్నాడు.

*మొదటిగా, పడిపోయిన తరువాత కలిగే పర్యవసానాలను బట్టి మనం సంపూర్ణులముగా సాగిపోవాలి.* (చదవండి 6:4-8.) పడిపోయేందుకు అవకాశం ఉందని ఈ వాక్య భాగం బోధిస్తుంది. ఈ వాక్యం "తప్పిపోయిన" (6:6) కొంతమంది గురించి చెప్తుంది. హెబ్రీ పత్రికలో ఇది మిగిలిన వాక్య భాగములవలనే ఇది విశ్వాస భ్రష్టత్వం జరిగే అవకాశాన్ని గురించి చెప్తుంది.

అంతేగాకుండ, నిజ క్రైస్తవులు కూడ తప్పిపోవచ్చు. తప్పిపోయిన వారి గురించి ఇక్కడ ఇవ్వబడిన వివరము ప్రకారము "వారు ఒకసారి వెలిగింపబడి, పరలోక సంబంధమైన వరమును రుచి చూచి పరిశుద్ధాత్మలో పాలివారైయున్నారు" (6:4). ఇటువంటి వివరణ అసలు క్రైస్తవులను గురించే ఇయ్యబడుతుంది![4]

విశ్వాస భ్రష్టత్వం[5] క్రైస్తవున్ని ప్రమాదకర స్థితిలో పెడుతుంది. తప్పిపోయినవారు ప్రమాదకర స్థితిలోనున్నారని ఈ వచనాలు తెలియజేస్తున్నాయి: "మారుమనస్సు పొందునట్లు అట్టివారిని మరల నూతనపరచుట అసాధ్యము" (6:6). దీని అర్థం ఏమిటి? ఒక క్రైస్తవుడు క్షమించరాని నేరము చేస్తే, అతడు ఇక క్షమించబడలేడన్నది దీని అర్థం కాదు. అయితే ఇది పాపములో కొనసాగడం గురించే చెప్తుంది ["వారు దేవుని కుమారుని సిలువవేయుచునే" ఉన్నారు]. "ప్రజలు పాపములోకొనసాగుతూ ఉన్నట్లయితే, వారు క్షమించబడడం అసాధ్యం." అంతేగాకుండా, "వారిని నూతనపరచుట అసాధ్యము" అని ఈ వచనం చెప్తుంది. అంటే వారిని ఇతరులు మార్చడం అనేది కష్టతరమైనది. ఒకవేళ వారు మారుమనస్సుపొందినట్టయితే, వారు ఎంత దూరం తప్పిపోయినా గాని, వారు రక్షింపబడతారు. ఇందులో ముఖ్యమైన విషయమేమంటే, ఇది మనకు జరుగకుండా మనం జాగ్రత్తపడాలి. మనం విశ్వాస భ్రష్టులం గాకుండా జాగ్రత్తపడుతూ మనం తిరిగి నూతన పరచబడలేనంతగా పాపంలో కొనసాగకుండా జాగ్రత్తపడాలి!

ఆత్మీయ ఎదుగుదల లోపం మనలను భక్తిహీనతకు నడిపిస్తుంది. అంతేగాకుండ, మనం ఎదుగకపోతే, సంపూర్ణత కోసం సాగనట్టయితే, మన విశ్వాసమునుండి తొలగిపోవుటకు దగ్గరగా ఉన్నామని ఈ వాక్యభాగం సూచిస్తుంది.

విశ్వాస భ్రష్టత్వం యొక్క పర్యవసానం నాశము. క్రైస్తవులు విశ్వాసహీనులు అయితే ఏం జరుగుతుంది అని చెప్పుటకు 6:7, 8 వచనాల్లో గ్రంథకర్త ఒక సాదృశ్యమును ఇస్తున్నాడు. వర్షంవలన భూమి దీవించబడినట్టు క్రైస్తవులు ఆశీర్వదించబడి మంచి ఫలమును ఫలించాలి. కానీ వారు తప్పిపోయి ఫలమునకు బదులు ముండ్ల తుప్పలను అందిస్తే, భూభాగం కాల్చివేయబడినట్లుగా, వారు నాశనమును ఎదురు చూడాల్సివస్తుంది. వారు అగ్నిచేత కాల్చివేయబడి, నాశనం చేయబడతారు (పోల్చండి 10:26-31)!

*రెండవదిగా, మన నిరీక్షణను బట్టి మనం "సంపూర్ణతలో సాగిపోవాలి."* (చదవండి హెబ్రీయులకు 6:9-20.) ఇక్కడ తన పాఠకులు ఆత్మీయంగా ఎదుగునట్లు వారిని ప్రోత్సహిస్తూ గ్రంథకర్త "క్యారట్" విధానాన్ని ఉపయోగించి మూడు సత్యములను చెప్తున్నాడు.

(1) అతడు వారియందు సంపూర్ణ నమ్మకమును చూపిస్తున్నాడు (6:9). ఇది వారిని ప్రోత్సహిస్తుంది.

(2) వారు ఇది వరకు చేసిన కార్యములను గురించి అతడు మాట్లాడుతున్నాడు (6:10-12), వారు చేసిన మంచి కార్యములను దేవుడు మరచిపోడని, వారు మెళకువ

కలిగియుండునట్లు వారిని ప్రోత్సహిస్తున్నాడు. “మీరు చేసిన కార్యమును అనగా మీరు పరిశుద్ధులకు ఉపచారము చేసినట్లు, ‘ఇంకనూ ఉపచారము చేయండి’ ” అని గ్రంథకర్త ప్రోత్సహిస్తున్నాడు.

(3) దేవుని వాగ్దానాలు నిశ్చయము మరియు మార్పులేనివి గనుక వారికున్న నిరీక్షణ గురించి అతడు మాట్లాడుతున్నాడు (6:13–20). దేవుడు తన ప్రజలను నిరుత్సాహపరచడు. దేవుని వాగ్దాన నెరవేర్పు నిమిత్తం అబ్రాహాము ఓపికతో నిరీక్షించి దాన్ని పొందిన విషయమును ఈ సత్యమును స్పష్టం చేస్తుంది (6:13–15). దీనికి తోడు దేవుని వాగ్దానం నిశ్చయము అని రెండింతలుగా నమ్మవచ్చు ఎందుకంటే, దీనిలో రెండు “మార్పులేని” విషయాలున్నాయి. ఒకటి స్వభావ సిద్ధంగా మార్పులేని దేవుడు, రెండవది, ఇందులో మార్పులేని ప్రమాణం ఉంది. దేవుని నమ్మకత్వం వాగ్దానాన్ని స్థిరము చేస్తుంది. తద్వారా ఆయన “మనకు ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసి వాగ్దానమును దృఢపరచెను” (6:18). ఈ నిరీక్షణ మన ఆత్మకు లంగరు వంటిది (6:19 వ.); లోకపరంగా పరిస్థితులు ఎలా ఉన్నా, స్థిర విశ్వాస జీవితములో కొనసాగడానికి ఇది సహాయం చేస్తుంది. మన నిరీక్షణ ఈ జీవితమునకు అతీతమైనది. ఇది “తెరలోపల ప్రవేశిస్తుంది” అనగా పరలోకం వైపు చూసేలా చేస్తుంది (6:20). అప్పుడు ఈ లోకంలో మనకు ఏం జరిగినా అది మన జీవితములను మార్చివేయలేదు.

## ముగింపు

మనం సంపూర్ణులమగుటకు సాగిపోదము! ఎంతటి సవాలు! మనకు ఒక సవాలు ఉంది: సంఘంగా మనం ఎలా ఉన్నాము? శిశువులుగా ఉన్నామా? వ్యక్తిగతంగా నేను ఎలా ఉన్నాను? ఆత్మీయ శిశువుగానా? అలా వద్దు! దేవుని నుండి తొలగిపోయే ప్రమాదం. దేవుని వాగ్దానాల ద్వారా కలిగే నిరీక్షణ మనం ఆత్మీయంగా ఎదుగునట్లు సహాయపడును గాక!

---

సూచనలు

[1]సువార్త ప్రాథమిక విషయాలను వివరించుటకు గ్రంథకర్త విశ్వాస బాప్తిస్మములను గూర్చిన బోధ, హస్త నిక్షేపణమును, మృతుల పునరుత్థానమును, నిత్యమైన తీర్పు అను విషయములను ఉదాహరణగా వివరిస్తున్నాడు. [2]కొన్ని సంఘాల్లో కొంతమంది విశ్వాసులుగా గాక సందర్శకులుగా వస్తుంటారు కాబట్టి వారు క్రైస్తవ్యం యొక్క ప్రాథమిక విషయాలను వినాలి. [3]ఒక వ్యక్తి గాడిదను నడిపించుటకు చెప్పబడే సాదృశ్యం “క్యారట్ లేదా కర్ర” విధానం. గాడిద ముందుకు కదలడానికి ఒక వ్యక్తి క్యారట్‌ను (వాగ్దానం) ఉపయోగించవచ్చు లేదా గాడిదను ముందుకు నడిపించడానికి కర్రను (హెచ్చరించడం) ఉపయోగించవచ్చు. [4]కొంతమంది విశ్వాసం నుండి తొలగిపోయే అవకాశం లేదని చెప్పుతారు కాబట్టి ఇది ఇక్కడ చెప్పబడింది. కొంతమంది తప్పిపోయిన వారిని (బైబిల్లో లేదా తమ అనుభవంలో) చూపించి వారు పేరుకే క్రైస్తవులు కానీ, దేవుని పిల్లలు కారు అని చెప్తారు. [5]ఈ వాక్యభాగంలో విశ్వాసంనుండి పడిపోవుట అనేది ఒక క్రైస్తవుడు చేసిన చిన్న తప్పును సూచించేది కాదు. ఒక క్రైస్తవుడు ఉద్దేశపూర్వకంగా పాపములో కొనసాగి, తమ పాపములు ఒప్పుకోక పోవడం గురించి ఇది చెప్తుంది (10:26).